ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా బాలకిష్టారెడ్డి

- వైస్ చైర్మన్‌గా ఇటిక్యాల పురుషోత్తం
- మహిళా వర్సిటీ, బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీలుగా సూర్య, గోవర్ధన్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

బాలకిష్టారెడ్డి

ఇటిక్యాల పురుషోత్తం

హైదరాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియమితులయ్యారు. తక్షణమే వీరి నియామకం అమల్లోకి వస్తుందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఈ పదవుల్లో మూడేండ్లపాటు కొనసాగుతారు. ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రస్తుతం మహీంద్రా యూనివర్సిటీలోని లా స్కూల్ డీన్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో నల్సార్ లా వర్సిటీ వీసీగా, రిజిస్ట్రార్‌గా పనిచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలంలోని పర్వతయ్యపల్లి ఆయన స్వగ్రామం. వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని గంధమల్ల. తొలుత ఆర్టీసీలో పనిచేసిన పురుషోత్తం.. ఆ తర్వాత ఓయూలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పాఠాలు బోధించారు. కాగా, పలు యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను సైతం ప్రభుత్వం నియమించింది. బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్, హైదరాబాద్ కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ధనావత్ సూర్య నియమితులయ్యారు.

పోలీస్ డ్యూటీ మీట్ సందర్భంగా బెలూన్లు ఎగురవేస్తున్న డీజీపీ జితేందర్, పోలీస్ అధికారులు శిఖాగోయల్, మహేశ్ భగవత్ తదితరులు

ఘనంగా 'పోలీస్ డ్యూటీ మీట్-2024'

- కార్యక్రమాన్ని ప్రారంభించిన డీజీపీ జితేందర్
- ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : 'పోలీస్ డ్యూటీ మీట్-2024'ను స్టేట్ పోలీస్ అకాడమీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని రాష్ట్ర డీజీపీ జితేందర్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నిర్వహిస్తున్న తొలి పోలీస్ డ్యూటీ మీట్ కావడంతో పోలీస్ అధికారులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి సీఐడీ డీజీ శిఖాగోయల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా 26 పోలీస్ విభాగాల నుంచి 13 బృందాలుగా ఏర్పడి పలు ఈవెంట్లు నిర్వహించినట్టు సీఐడీ డీజీ శిఖాగోయల్ తెలిపారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాలతోపాటు జిల్లాల నుంచి మొత్తం 400 మంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్టు చెప్పారు. సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, యాంటీ సబొటేజీ చెక్స్, డాగ్ స్క్వాడ్, కంప్యూటర్ అవేర్‌నెస్, ఫొటో, వీడియోగ్రఫీలో పోటీలు నిర్వహించినట్టు వెల్లడించారు. విజేతలు వచ్చే జనవరిలో రాంచీలో నిర్వహించనున్న ఆలిండియా పోలీస్ మీట్‌లో పాల్గొనున్నట్టు తెలిపారు.

గ్రేటర్ కాంగ్రెస్ సమావేశం రచ్చరచ్చ

- పీసీసీ చీఫ్ సమక్షంలోనే గ్రూప్ రాజకీయాలు
- రెండు వర్గాలుగా చీలి పరస్పర ఫిర్యాదులు
- 'యూ డాగ్స్' అంటూ మేయర్ వ్యాఖ్యలతో దుమారం
- విజయలక్ష్మి తీరుపై నాయకుల ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం సంగతి దేవుడెరుగు.. కనీసం పది నిమిషాలు కూడా పార్టీ నాయకులు కలిసి మాట్లాడుకునే పరిస్థితి లేదు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు, పార్టీ బలోపేతం లక్ష్యంగా గాంధీభవన్ వేదికగా పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన గ్రేటర్ కాంగ్రెస్ సమావేశం రసాభాసగా మారింది. కార్పొరేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జీల మధ్య సమన్వయ లోపం బయటపడింది. హైదరాబాద్, సికింద్రాబాద్, ఖైరతాబాద్ డీసీసీలతో జరిగిన సమావేశంలో ఒకరిపై ఒకరి ఫిర్యాదులు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా, గ్రేటర్‌లో కాంగ్రెస్ ఉనికి లేకపోవడంతో డీసీసీ నేతలపై పార్టీ అగ్రనేతలు అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఒకానొక సందర్భంలో.. 'మనం పిలిస్తే, కనీసం పది మంది కూడా వచ్చే పరిస్థితి లేదు' అని గ్రేటర్ నేతలతో మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించడం గమనార్హం. సమావేశం జరుగుతున్న క్రమంలోనే జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి... 'యూ డాగ్స్' అంటూ చేసిన వ్యాఖ్యలు గ్రేటర్ నేతల మధ్య అగ్గి రాజేసింది. మేయర్ వ్యాఖ్యలపై కార్పొరేటర్లు, నియోజక ఇన్‌చార్జీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఒకరినొకరు దూషించుకుంటూ బాహాబాహీకి దిగారు.

రెండుగా చీలిన గ్రేటర్ కాంగ్రెస్

గ్రేటర్‌లో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలింది. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నామని ఒక వర్గం, పార్టీ మారిన నేతలు మరో వర్గంగా పీసీసీ చీఫ్ ముందే వాదోపవాదనలకు దిగారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఆదం సంతోష్, వినోద్, పీజేఆర్ కూతురు విజయారెడ్డి తదితరులు ఒక వర్గంగా, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ మరో వర్గంగా చీలి పరస్పర వాదనలకు దిగారు. పార్టీని తామే నడిపిస్తున్నామంటూ మేయర్ వర్గం వాదించడంతో విజయారెడ్డి వర్గం తీవ్రంగా ఖండించింది. దీంతో ఇరు వర్గాల నేతల మధ్య ఘాటైన వ్యాఖ్యలతో గాంధీభవన్ వేడెక్కింది. ఈ సందర్భంలోనే 'యూ డాగ్స్' అంటూ మేయర్ వ్యాఖ్యానించడం మరింత రచ్చకు దారితీసింది. పరిస్థితులను చక్కబెట్టేందుకు స్వయంగా ప్రభుత్వ సలహాదారు, పార్టీ సీనియర్ నేత కే కేశవరావు జోక్యం చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. చివరకు అనుకున్న లక్ష్యాలపై చర్చించకుండానే సమావేశాన్ని ముగించాల్సి వచ్చింది.

పరస్పర ఫిర్యాదులు

ముఖ్యంగా డీసీసీ నాయకులు కేవలం అగ్రనేతల పర్యటనలు ఉన్నప్పుడే తళుక్కుమంటూ, ఆ తర్వాత జెండా మోసిన కార్యకర్తలను పట్టించుకోవడమే లేదని నేరుగా పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీలో కేవలం పదవులు అనుభవించేందుకే అన్నట్టుగా వ్యవహరిస్తున్న కొంతమంది జిల్లా అగ్రనేతల తీరుపై విస్తృతంగా చర్చించుకున్నారు. కనీసం పార్టీ సమావేశాలకు జనాలను తరలించలేకపోతున్నారని, గ్రేటర్ నేతలపై నమ్మకం లేకనే జిల్లాల నుంచి తరలించాల్సి వస్తున్నదని వాపోయారు. మూడు జిల్లాల డీసీసీలు కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం సరికాదని పీసీసీ చీఫ్, ఏఐసీసీ నేతలు వార్నింగ్ ఇచ్చారు. ఖైరతాబాద్ డీసీసీ నేత రోహిన్‌రెడ్డి వ్యవహార శైలిపై పీజేఆర్ కూతురు విజయారెడ్డి ఫిర్యాదు చేశారు. సికింద్రాబాద్ డీసీసీ నేత ఆదం సంతోష్‌కుమార్‌పై మరికొందరు ఫిర్యాదు చేశారు.

19న లా కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, అక్టోబర్16 (నమస్తే తెలంగాణ): బీసీ, ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని పలు లా కాలేజీల్లో సీట్ల భర్తీకి 19వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా సొసైటీల కార్యదర్శులు సైదులు, వర్షిణి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం బాలుర లా కాలేజీలో 47, హనుమకొండ జిల్లా కాజీపేటలోని బీసీ గురుకుల వుమెన్ లా కాలేజీలో 39, సరూర్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటిగ్రేటెడ్ లా కాలేజీలో 29సీట్లు అందుబాటులో ఉన్నట్టు వెల్లడించారు. లాసెట్ - 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా 19వ తేదీన ఆయా కళాశాలల్లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని వెల్లడించారు. పూర్తి వివరాలకు 93966 00601, 99083 44469 నంబర్లలో సంప్రదించాలని కార్యదర్శులు సూచించారు.

'విదేశీ విద్యానిధి' దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పెరిక యాదయ్య తెలిపారు. విదేశాల్లో ఉన్నత చదువులకు ఉపకార వేతనాల కోసం అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. వివరాలకు https:// talanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

జర్మనీలో స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు

హైదరాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ) : జర్మన్ భాషలో శిక్షణ, నర్సింగ్ విద్యతోపాటు స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నది. 18 నుంచి 30 ఏండ్లు కలిగిఉండి ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్‌లో కనీసం 60 శాతం మార్కులు పొందినవారు అర్హులు. హైదరాబాద్‌లోని టామ్‌కామ్ క్యాంపస్‌లో 8 నెలల పాటు అభ్యర్థులకు బీ2 స్థాయి వరకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తారు. అనంతరం మూడేండ్లు జర్మనీలో నర్సింగ్ డిప్లొమా కోర్సులో చేర్పిస్తారు. కోర్సు సందర్భంగా నెలకు సుమారు రూ.లక్ష వరకు స్టైపెండ్ అందిస్తారు. కోర్సు పూర్తయ్యాక జర్మనీ హాస్పిటల్స్‌లో నెలకు రూ. 2.5 లక్షల నుంచి 3 లక్షల వరకు జీతంతో స్టాఫ్‌నర్స్ ఉద్యోగం ఇస్తారు. ప్రస్తుతం 42 మందితో కూడిన రెండు బ్యాచ్‌లు విజయవంతంగా నడుస్తుండగా, మూడో బ్యాచ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు టామ్‌కామ్ సీఈఓ తెలిపారు. ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, పూర్తివివరాలకు 6302292450, 7901290580 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. టామ్‌కామ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

భుజంగరావు మధ్యంతర బెయిల్ పొడిగింపు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అదనపు ఎస్పీ భుజంగరావుకు ఆరోగ్య పరిస్థితులపై మంజూరుచేసిన మధ్యంతర బెయిల్‌ను కోర్టు పొడిగించింది. రెగ్యులర్ బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ మేరకు ఒకటవ అదనపు జిల్లా జడ్జి రమాకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆరోగ్య పరీక్షల కోసం మూడోసారి 25 రోజుల పాటు మధ్యంతర బెయిల్‌ను పొడిగించారు. బెయిల్ గడువు ముగియగానే వచ్చేనెల 11న కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించారు.

గుత్తాతో ఏపీ మండలి చైర్మన్ భేటీ

హైదరాబాద్, అక్టోబరు 16 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యె మోషెన్‌రాజు భేటీ అయ్యారు. బుధవారం తెలంగాణ శాసనమండలిని సందర్శించిన మోషెన్‌రాజును.. గుత్తా సుఖేందర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఇరు రాష్ట్రాల తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. కార్యక్రమంలో తెలంగాణ లేజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ లెక్చరర్ అభ్యర్థులకు వెబ్ ఆప్షన్లు

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ లెక్చరర్ పోస్టుల భర్తీకి రెండో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా వెబ్ ఆప్షన్ల లింక్ గురువారం ఉదయం 10.30గంటల నుంచి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నది. పూర్తి వివరాలకు https://www. tspsc.gov.in ని సందర్శించాలని సూచించింది.

ప్రాణాలు తీసిన అతివేగం

- వాగులోకి దూసుకెళ్లిన కారు
- అక్కడికక్కడే ఏడుగురు మృతి
- మృతులంతా గిరిజనులు
- తీవ్రగాయాలతో బయటపడ్డ డ్రైవర్
- మెదక్ జిల్లా ఉసిరికపల్లిలో ఘటన

శివ్వంపేట, అక్టోబర్ 16 : నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం కారణంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి బస్టాండ్ సమీపంలోని వాగు బ్రిడ్జి వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం... శివ్వంపేట మండలంలోని శంకర్‌తండా, సీతారాంతండా, తాళ్లపల్లి తండాకు చెందిన 8 మంది కారులో వర్గల్ మండలం సీతారాంపల్లి తండాలో జరిగిన బంధువుల శుభకార్యానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఉసిరికపల్లి గ్రామశివారులోని వాగుబ్రిడ్జి వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు గుంతల రహదారిపై అతివేగంగా వచ్చి అదుపు తప్పి వాగులోని చెట్టుకు ఢీకొని పడిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని స్థానికులు, జేసీబీ సహాయంతో వాగులోని కారును బయటకు తీశారు. రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ నామ్‌సింగ్‌కు తీవ్రగాయాలు కాగా, అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను తాళ్లపల్లితండాకు చెందిన ధనావత్ శివరాం (55), ధనావత్ దుర్గమ్మ (45), జెగ్య తండాకు చెందిన మాలోత్ అనిత (30), మాలోత్ బిందు (14), మాలోత్ శ్రావణి (12), భీమ్లాతండాకు చెందిన గుగులోత్ శాంతి (45), గుగులోత్ మమత (16)గా గుర్తించారు. ఇందులో గుగులోత్ శాంతి, గుగులోత్ మమతలు తల్లీకూతురు కాగా, తాళ్లపల్లితండాకు చెందిన ధనావత్ శివరాం, ధనావత్ దుర్గమ్మ దంపతులు. డ్రైవర్ నామ్‌సింగ్‌ను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఘటనాస్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సందర్శించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో ఏడుమంది అక్కడికక్కడే మృతిచెందడం బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. డ్రైవర్‌కు మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

శివ్వంపేట రోడ్డు ప్రమాదంలోని మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలి. ప్రమాదంలో ఒకేసారి ఏడుగురు మృతి చెందడం బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెల్పుతున్నాను. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి. – మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

శివ్వంపేట రోడ్డు ప్రమాదంలో బంధువులైన ఏడుగురు ఒక్కసారిగా మృతి చెందడం బాధాకరం. మృతుల కుటుంబాలకు అండగా ఉంటా. ప్రభుత్వం కూడా బాధిత కుటుంబాలకు అండగా ఉండి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. – నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

డెంగ్యూతో ఒకరు మృతి

శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ములుగు రూరల్, అక్టోబర్ 16 : డెంగ్యూతో బాధపడుతూ ములుగు జిల్లాలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ములుగు మండలం జంగాలపల్లికి చెందిన మూల శ్రీనివాస్‌రెడ్డి (55) వారం నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. దవాఖానలో చూపించగా పరీక్షలు చేసిన వైద్యులు డెంగ్యూ అని నిర్ధారించారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

ఐదేండ్లకే ఆగిన గుండె

జమ్మికుంటలో చిన్నారి మృతి

ఉక్కు (ఫైల్)

వీణవంక (జమ్మికుంట), అక్టోబర్ 16: కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఓ చిన్నారి గుండెపోటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. భూపాలపల్లి జిల్లా పంగిడిపల్లికి చెందిన రాజు-జమున దంపతులకు కొడుకు, కూతురు ఉక్కు(5)ఉన్నారు. వీరు కొద్ది రోజులుగా జమ్మికుంటలో నివాసం ఉంటున్నారు. మంగళవారం చిన్నారి పాఠశాలకు వెళ్లే క్రమంలో కండ్లు తిరగడంతో తల్లిదండ్రులు స్థానిక ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి హనుమకొండలోని ఓ దవాఖానకు తరలించగా డాక్టర్లు పరీక్షించి మృతిచెందినట్టు తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్

శేరిలింగంపల్లి, అక్టోబర్ 16: గచ్చిబౌలిలో యువతిపై లైంగికదాడి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించిన పోలీసులు నిందితుడిని లింగంపల్లి గోపీనగర్‌లో నివాసముండే ప్రవీణ్‌గా గుర్తించారు. నిందితుడు పెట్రోల్ బంక్‌లలో జరిపిన లావాదేవీల ఆధారంగా మియాపూర్‌లో అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లా కేతిపల్లి మండలం కోలాపహాడ్ గ్రామానికి చెందిన జంగం ప్రవీణ్(24), నగరానికి వచ్చి గోపీనగర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి తన ఆటో(ఏపీ23 వీ 3877) ఎక్కిన యువతి(32)పై లైంగికదాడి చేశాడు. బాధితురాలి కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకోవడంతో ఆమెను ఆటో నుంచి తోసి పరారయ్యాడు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని బాధితురాలిని దవాఖానకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు మియాపూర్‌లోఉన్నట్లు గుర్తించి ప్రవీణ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడికి గతంలో ఎలాంటి క్రిమినల్ హిస్టరీ లేదని, కేవలం మద్యమత్తులో ఈ అఘాయిత్యానికి ఒడిగట్టి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా, బాధిత యువతి పొంతన లేని మాటలు చెబుతున్నట్టుగా తెలుస్తున్నది. తాను పనిచేస్తున్నట్టుగా చెబుతున్న అడ్రస్‌లో అసలు ఎలాంటి కార్యాలయం లేదని పోలీసులు గుర్తించారు. బాధితురాలు అర్కిటెక్ట్ అని చెప్పిన విషయం వాస్తవం కాదని తెలుస్తున్నది. దీంతో కేసును జాగ్రత్తగా దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

పోలీసుల అదుపులో కిషన్‌జీ సహచరి?

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆమెను అదుపులోకి తీసుకున్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. మావోయిస్టు దివంగత కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ భార్యనే పోతుల కల్పన. ప్రస్తుతం దండకారణ్యంలోని సౌత్ సబ్ డివిజనల్ బ్యూరోలో కేంద్రక మిటీ సభ్యురాలి హోదాలో పనిచేస్తున్నసు జాతక్క అలియాస్ పద్మ, కల్పన, మైన్ బా యి, ఝాన్సీబాయి(60)ని నిఘా వర్గాలు ట్రేస్ చేసినట్టుగా సమాచారం. ఛత్తీస్‌గఢ్ సౌత్ బస్తర్‌లో ఉంటున్న సుజాతక్క బయటికి ఎందుకొచ్చిందో తెలియదు.

రసాయనాల ట్యాంక్‌లో పడి కవలలు మృతి

జీడిమెట్ల, అక్టోబర్ 16 : రసాయనాల ట్యాంక్‌లో పడి ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాలు.. ఏపీకి చెందిన రాము(32), లక్ష్మణ్(32)కవలలు. జీవనోపాధి కోసం వచ్చి అన్నారంలో ఉంటున్నారు. 4 రోజులుగా 'సబూరి ఫార్మా' కంపెనీలో పని చేస్తుండగా బుధవారం రామ్, లక్ష్మణ్‌తో పాటు సురేందర్‌రెడ్డి పరిశ్రమలోని వ్యాక్యూం ట్యాంక్ గోడపై నిలబడి పనిచేస్తున్నారు. టీ తాగేందుకు దిగే క్రమంలో రాము ట్యాంక్‌లో పడిపోయాడు. రామును రక్షించేందుకు లక్ష్మణ్ ప్రయత్నించగా అతను అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వీరిని గమనించిన సురేందర్‌రెడ్డి తోటి కార్మికులతో కలిసి ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే ఇద్దరు మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు.

అతివకు అండగా 'సఖి'

- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన కేంద్రాలు

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సఖి కేంద్రాలు ఎంతోమంది మహిళలకు భరోసానిస్తున్నాయి. పలు సమస్యలతో బాధితులుగా మారిన బాలికలు, యువతులు, వివాహితలు, అనాథలకు అండగా నిలుస్తున్నాయి. అవసరమైన కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు ఆశ్రయం కల్పిస్తున్నాయి. బాధిత మహిళలకు వరంగా మారిన ఈ కేంద్రాలు వారికి అండగా నిలుస్తున్నాయి. ఈ కేంద్రాలకు పోలీసు శాఖ, న్యాయ విభాగాలు సహకరిస్తున్నాయి. కులమతాలు, ప్రాంతీయ బేధాలకు తావులేకుండా అభాగ్యులను ఈ సెంటర్లు చేరదీస్తున్నాయి. బాధితులకు అవసరమైన వసతి కల్పించడంతోపాటు ఖర్చు మొత్తం మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో భరిస్తున్నారు.

65వేల కేసుల నమోదు

2017లో ఏర్పాటు చేసిన సఖి కేంద్రాల్లో ఇప్పటివరకు దాదాపు 65,600 కేసులు నమోదైనట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇందులో 43,100 గృహహింస కేసులు, వరకట్నం వేధింపులు 3,049, సైబర్ నేరాలు/చీటింగ్ 3,185, లైంగిక వేధింపులు(పోక్సో) 2,278, బాల్య వివాహాలు 1,819, మిస్సింగ్/కిడ్నాప్‌లు 4,212, లైంగిక హింస 389, లైంగికదాడి 546, ఉమెన్ ట్రాఫికింగ్ 182, యాసిడ్ దాడి 5 కేసులు నమోదయ్యాయి. ఇతర రకరకాల అంశాలు కలిపి మొత్తం 6,800 వరకు కేసులు నమోదైనట్టు సంబంధిత అధికారులు తెలిపారు.

ఎన్‌హెచ్ఎం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కోఠిలోని ఎన్‌హెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఎన్‌హెచ్ఎంలో ఎన్నాళ్లో శ్రమదోపిడీ?

- పనికి తగిన వేతనం ఇవ్వాలి
- శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి
- ఎన్‌హెచ్ఎం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ
- కోఠి ప్రధాన ఆఫీసులో ధర్నా

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): 'సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పులు అమలుకావడం లేదు.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ మార్గదర్శకాలను పాటించడం లేదు. ఎన్నాళ్లీ శ్రమదోపిడీ?' అని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికి తగిన వేతనాలు ఇవ్వాలని, తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాద్ కోఠిలోని ఎన్‌హెచ్ఎం కార్యాలయం ఎదుట నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్ఎం) పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ సాధారణ సెలవులుగానీ, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు గానీ అమలు కావడం లేదని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వంటి సౌకర్యాలు కల్ప